## క్లుప్తంగా

### డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ తిరిగి కేఎంసీకి



డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్

**కర్నూలు(హాస్పిటల్):** ప్రొఫెసర్ ఆఫ్ రేడియోథెరపీ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ తిరిగి కర్నూలుకు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఇటీవల రాజమహేంద్రవరానికి బదిలీ అయ్యారు. వారం రోజుల్లోనే తిరిగి ఆయనను అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద కర్నూలు మెడికల్ కాలేజీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. తిరిగి ఆయనకు అవే బాధ్యతలు అప్పజెప్పే అవకాశం ఉంది.

### ఆర్థోపెడిక్ డాక్టర్ డీవీ రమణ మృతి



డాక్టర్ డీవీ రమణ

**కర్నూలు(హాస్పిటల్):** కర్నూలుకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, సిరినోబుల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ డీవీ రమణ కన్నుమూశారు. శనివారం ఉదయం ఆయన అశోక్‌నగర్‌లోని తన ఇంట్లో ఉండగానే తీవ్ర గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలిపోయారు. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించేలోపు మృతి చెందారు. పత్తికొండకు చెందిన ఈయన ఎంబీబీఎస్‌ను 1976లో కర్నూలు మెడికల్ కాలేజీలో, అనంతరం సీఎంసీ వేలూరులో ఆర్థోపెడిక్ పీజీ చదివారు. ఎముకల డాక్టర్‌గా ఆయన కర్నూలుతో పాటు జిల్లా ప్రజలకు ఎంతో సుపరిచితులు. ఎన్ఆర్ పేటలో మొదటగా ప్రైవేటు నర్సింగ్‌హోమ్ ప్రారంభించారు. ఆయన మృతి పట్ల వైద్యులు, మెడికల్‌రెప్‌లు తీవ్ర సంతాపం తెలిపారు.

### సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బీవీ సతీష్‌కుమార్ బదిలీ

**కర్నూలు(హాస్పిటల్):** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బీవీ సతీష్ కుమార్ మళ్లీ బదిలీ అయ్యారు. ఆయనను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సాధారణ బదిలీల్లో భాగంగా ఐదు రోజుల క్రితం ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ బీవీ రావు బదిలీపై గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో బీవీ సతీష్‌కుమార్ వచ్చిన వెంటనే సెలవు పెట్టి వెళ్లిపోయారు. ప్రస్తుతం సీఎస్ఆర్ఎంఓగా ఇంకా ఎవ్వరినీ నియమించలేదు.

### 30న కలెక్టరేట్ ఎదుట ధర్నా

**కర్నూలు(సెంట్రల్):** 2024 ఖరీఫ్‌లో రైతులు పండించిన పొగాకు మొత్తాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతూ 30వ తేదీన కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ తెలిపారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..పొగాకు రైతును కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. పండించిన పంటను కొనుగోలు చేయించడానికి ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడంలేదని ప్రశ్నించారు.

### పీవీ నరసింహారావు సేవలు చిరస్మరణీయం



పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కర్నూలు(సెంట్రల్):** పీవీ నరసింహారావు ప్రధానిగా, ముఖ్యమంత్రిగా దేశానికి, రాష్ట్రానికి అందించిన సేవలను మరువలేమని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. శనివారం పీవీ 104 వ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాజీమంత్రి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, నాయకులు దామోదారం రాధాకృష్ణ, అనంతరత్నం, బతుకన్న, లాజరస్ పాల్గొన్నారు.

## సాక్షి సినిమాలు



**ఎస్‌వీసీ కాంప్లెక్స్** : కన్నప్ప, కుబేరా, ఎఫ్1 ది మూవీ, మా సితారే జమీన్ పర్, మార్గన్
**వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్** : కన్నప్ప, కుబేరా, భైరవం, ఎఫ్1 ది మూవీ, హనుమాన్ జంక్షన్, చంద్రేశ్వర (అదృశ్య ఖడ్గం)
**వెంకటేష్ సినీ కాంప్లెక్స్** : కుబేరా
**శ్రీరామ** : కట్టప్ప జడ్జిమెంట్
**రాజ్** : మార్గన్
**భరత్ కాంప్లెక్స్** : వెంకి (2004)
**విజయ** : కుబేరా
**విక్టరీ** : పాపా (ఓ నాన్న)

# నిబంధనలకు పాతర

- ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల్లో ప్రజాప్రతినిధుల సిఫారసుకు ప్రాధాన్యం
- కోరుకున్న స్థానాలు దక్కక ఉద్యోగుల ఆందోళన



ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పీఆర్ ఎస్ఈ, ఇంజనీరింగ్ అధికారులు

**కర్నూలు (అర్బన్) :** రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో అన్ని కేటగిరీల్లో మితిమీరిన రాజకీయ జోక్యం చోటు చేసుకుంటోంది. దీంతో అర్హులైన అనేకమంది ఉద్యోగులకు వారు కోరుకున్న స్థానాలు దక్కకపోవడం పట్ల తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి స్థానిక జిల్లాపరిషత్ ప్రాంగణంలోని పీఆర్ ఎస్ఈ కార్యాలయ ఆవరణలో ఉమ్మడి జిల్లాలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలకు కౌన్సెలింగ్ జరిగింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 728 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉండగా వీరిలో 477 మంది ఒకే ప్రాంతంలో ఐదు సంవత్సరాల సర్వీసును పూర్తి చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వారిని తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంది. అలాగే రిక్వెస్ట్ బదిలీలు, మెడికల్, స్పౌజ్, డిసేబుల్డ్ చిల్డ్రన్స్ ఉన్నవారికి కూడా బదిలీల్లో అవకాశం కల్పించింది. ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించి తొలుత కొంత గందరగోళ పరిస్థితి నెలకొనిందని, ప్రజాప్రతినిధుల సిఫారసుల మేరకు బదిలీలు జరిగినట్లు తమ దృష్టికి రావడంతో ఆందోళన కార్యక్రమం చేపట్టినట్లు అసోసియేషన్ ఆఫ్ సెక్రెటేరియట్ ఇంజనీర్స్ జిల్లా అధ్యక్షులు పి.బాలయ్య తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేపడుతున్న విషయాన్ని పంచాయతీ రాజ్ ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకుపోయామన్నారు. గందరగోళ పరిస్థితిపై ఎస్ఈ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలను కొనసాగిస్తున్నామని చెప్పారు. 5 సంవత్సరాలు పూర్తయిన, స్పెషల్ కేటగిరీ ఉద్యోగుల బదిలీలు పూర్తయ్యాయని, మిగిలిన ఉద్యోగులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

# నిషేధిత జాబితాలోని భూమి రిజిస్ట్రేషన్

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

**కర్నూలు(సెంట్రల్):** కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిషేధిత జాబితాలోని ఓ భూమి మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ అయింది. ఈ నెల 27వ తేదీన జరిగిన ఈ అక్రమ రిజిస్ట్రేషన్ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్నూలు అర్బన్ మండలం మామిదాలపాడు సర్వే నంబర్ 233/3ఏ లో 1.09 ఎకరాల భూమి ఉంది. ఇది ప్రభుత్వ పొరంబోకు భూమి కావడంతో రిజిస్ట్రేషన్ చేయకుండా జిల్లా కలెక్టర్ 2019 ఫిబ్రవరి 27వ తేదీన నిషేధిత జాబితాలో ఉంచారు. ఈ క్రమంలో ఈ నెల 27వ తేదీన ఈ భూమిని కర్నూలుకు చెందిన సయ్యద్ సాజిద్‌బాషా, కె.ఉమా మహేశ్వరరావు అనే వ్యక్తులు కృష్ణగిరి మండలం తొగర్చేడుకు చెందిన బి.జానార్ధన్‌నాయుడు అనే వ్యక్తికి చూపుడు ఆయాకం పెట్టారు. అందుకు సంబంధించి కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 5865/2025 గా జూన్ 27వ తేదీన మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ అయింది. కాగా, నిషేధిత జాబితాలో ఉన్న భూమిని ఎందుకు రిజిస్ట్రేషన్ చేశారో వివరణ కోరడానికి ప్రయత్నిస్తే సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న వరప్రసాదు స్పందించకపోవడం గమనార్హం.


5
0803217711

మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ జరిగిన 233/3ఏ సర్వే నంబర్ షెడ్యూల్ వివరాలు

### ఈ నీరు తాగేదెలా?

**కర్నూలు(సెంట్రల్):** నగరంలోని 43వ వార్డు ఇందిరగాంధీ నగర్‌లోని కుళాయిలకు కలుషిత నీరు సరఫరా కావడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బురద బురదగా ఉన్న నీటిని ఎలా తాగాలో చెప్పాలని మునిసిపల్ అధికారులను ప్రశ్నించారు. తరచూ ఒండు నీరు వస్తున్నా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని, తప్పని పరిస్థితిలో తాగి తాము రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయకపోతే మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు ఈ సందర్భంగా హెచ్చరించారు.



ఇందిరగాంధీ నగర్‌లో కుళాయిలకు సరఫరా అయిన బురద నీరు

### హైకోర్టు జడ్జీలను కలసిన కలెక్టర్, ఎస్పీ

**కర్నూలు(సెంట్రల్):** అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు కర్నూలుకు వచ్చిన హైకోర్టు జడ్జి జస్టిస్ బీఎస్ భానుమతి, రిటైర్డ్ జడ్జి జస్టిస్ వీఆర్‌కేకే సాగర్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది, ఎస్పీ విక్రాంత్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ అతిథిగృహంలో వారిని కలసి పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని తాజా పరిస్థితులను అధికారులు వారికి వివరించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**ఓర్వకల్లు:** హుసేనాపురం జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తిప్పాయపల్లె గ్రామానికి చెందిన బాలస్వామి(63) అనే వ్యక్తి శుక్రవారం మద్దిలేటయ్య స్వామి దర్శనం కోసం వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వచ్చేందుకు హుసేనాపురం రోడ్డుపై దిగాడు. అక్కడ రోడ్డు దాటుతుండగా కర్నూలు వైపు నుంచి తిరుపతికి వెళుతున్న టెంపో వాహనం బాలస్వామిని ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

### ప్రెస్ క్లబ్ నిర్వహణకు భవనాల కేటాయింపు

**కర్నూలు(సెంట్రల్):** జిల్లా కేంద్రం కర్నూలులో ప్రెస్ క్లబ్ నిర్వహణకు రెండు ప్రభుత్వ క్వార్టర్లను కేటాయిస్తూ డీఆర్వో పి.వెంకట నారాయణమ్మ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ గుప్తా అభ్యర్థన మేరకు వాటిని అద్దె ప్రతిపాదికన కేటాయిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. 15 రోజుల్లో ఆ క్వార్టర్లను స్వాధీనం చేసుకొని మొదటి నెల అద్దెను చెల్లించాలని సూచించారు. కాగా, ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు అన్ని జర్నలిస్టు సంఘాలు, యూనియన్ల నాయకులు, సీనియర్ జర్నలిస్టుల సహకారం ఎం తోఉందని, వారిందరి సూచనలతో ముందుకు వెళ్తామని అధ్యక్షుడు సత్యనారాయణ గుప్తా ఈ సందర్భంగా పేర్కొన్నారు.

### జీబీ దర్గాను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

**కర్నూలు (సిటీ):** నగరంలోని పాతబస్తీలో ఉన్న జీబీ దర్గాను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు ఎంఏ హాఫీజ్‌ఖాన్ దర్శించుకున్నారు. శనివారం దర్గా ఉరుసు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే దర్గా మతపెద్దలతో కలిసి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రత్యేక ఫాతెహాలు సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

### 30న బీజేపీ మాక్ పార్లమెంట్

**కర్నూలు కల్చరల్:** బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు నగర శివారులోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కమ్మ తోట రామకృష్ణ పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు డీకే అరుణ, మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, ఆదోని ఎమ్మెల్యే పీవీ పార్థసారథి, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మల కిషోర్ అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. అసెంబ్లీ కన్వీనర్లు, కో కన్వీనర్లు, మండల అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

### బహిరంగసభను జయప్రదం చేయండి

**కర్నూలు(సెంట్రల్) :** నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ జూన్ 30వ తేదీన సాయంత్రం 5 గంటలకు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆవాజ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్ పిలుపునిచ్చారు. ఈ సభను ఆవాజ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. శనివారం ఆ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

### అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**కర్నూలు(సెంట్రల్):** అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మినీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ డిమాండ్ చేశారు. శనివారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన అసోసియేషన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. గత పదేళ్లుగా అంగన్‌వాడీల జీతాలను పెంచడం లేదన్నారు. అధికారంలోకి రాక మునుపు చంద్రబాబునాయుడు అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి వచ్చాక మోసం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్న డిమాండ్లపై స్పందించడంలేదన్నారు. అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జూలై 9వ తేదీన సార్వత్రిక సమ్మెకు దిగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చాందిని, చౌడేశ్వరి, మంత్రాలయం నుంచి సుశీలమ్మ, పత్తికొండ నుంచి కాంతమ్మ, పార్వతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న లలితమ్మ

### ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

**కర్నూలు (టౌన్):** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని మాజీ ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శనివారం స్థానిక దామోదరం సంజీవయ్య స్మారక మున్సిపల్ మెయిన్ పాఠశాల విద్యార్థులకు ఆయన హాకీ క్రీడ కు సంబంధించిన క్రీడా పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు, మాజీ కార్పొరేటర్ గుడిపల్లి సురేంద్ర, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు జోసఫ్ లక్ష్మ య్య, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు దాసరి సుధీర్, పీఈటీ బాషా తదితరులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ నగర్‌లో సీసీ రోడ్లు వేయాలి

**కర్నూలు(సెంట్రల్):** వెంకన్నబావి సమీపంలోని అంబేడ్కర్ నగర్‌లో సీసీరోడ్లు వేయాలని సీపీఐ నగర సహాయకార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన కాలనీలో పర్యటించి అధ్వానంగా ఉన్న రోడ్లను పరిశీలించారు. ఇక్కడ 200 కుటుంబాలు నివాసం ఉంటున్న సరైన వసతులను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో లచ్చమ్మ, తిమ్మప్ప,పద్మావతి, యశోద, అరుణమ్మ,భాగ్యమ్మ, కస్తూరి, శిరీష పాల్గొన్నారు.

### వారిని కఠినంగా శిక్షించాలి

**కర్నూలు(సెంట్రల్):** కోల్‌కతలో మహిళా లా స్టూడెంట్‌పై అత్యాచారం చేసి చంపిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రంగనాథ్, జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, కోశాధికారి దస్తగిరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాముడు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పాలకులను కోరారు.

# చట్టాలపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద

**కర్నూలు సిటీ:** గుడ్ టచ్..బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలపై పిల్లలు అవగాహన కలిగి ఉండాలని డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద అన్నారు. శనివారం కట్టమంచి రామలింగారెడ్డి మున్సిపల్ మెమోరియల్ హైస్కూల్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా బాలల సంరక్షణ విభాగం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, నైస్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. చిన్నారులు తమకు తెలియని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి బాలికలకు వివరించాలని ఆమె సూచించారు.కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, హెచ్ఎం వెంకటరెడ్డి, న్యాయవాది లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

**కర్నూలు (టౌన్):** క్రీడల వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు క్రమ శిక్షణ అలవడుతుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. శనివారం నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో అంతర్ జిల్లాల రగ్బీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు హాజరైన ఆయన వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచ యం చేసుకున్నారు. అతిథులకు క్రీడాకారులు గౌరవ వందనం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ యువత ఆరోగ్యంగా, క్రమశిక్షణ తో ఉన్నప్పుడు ఆ దేశం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరు జీవనశైలిలో మార్పు లు తెచ్చుకొని ఆరోగ్యంగా జీవించాలన్నారు. నగరంలో క్రీడలను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, చిన్న సుంకన్న, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ

# ఎంహెచ్ హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలి

**కర్నూలు(హాస్పిటల్):** ప్రభుత్వ అనుమతి లేకుండా వైద్యం చేస్తున్న ఎంహెచ్ హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఏఓ అరుణకు ఏఐవైఎఫ్ నాయకులు శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కొన్ని సంవత్సరాల నుంచి ఎంహెచ్ హాస్పిటల్ వారు వైద్యం చేయడమే గాక వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. చర్యలు తీసుకోవాల్సిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించి అనుమతిలేని ఆసుపత్రులను సీజ్ చేయాలని కోరారు.



ఏఓ అరుణకు వినతి పత్రం సమర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

## ఈ రోజు

### సుమధుర గీతాల సంగీత విభావరి

**కర్నూలు కల్చరల్:** ప్రకాష్ గ్రూప్ మెలోడీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు రాజ్‌విహార్‌లోని అంబేద్కర్ భవన్‌లో తెలుగు, హిందీ సినిమాల సుమధుర గీతాల సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, సింగర్ రాణి తెలిపారు. గాయనీ గాయకులు బీవీ ప్రకాష్, సుధారాణి, పుష్పరాజ్, చిట్టి, షుకూర్ పాటలు ఆలపిస్తారని పేర్కొన్నారు. సంగీత ప్రియులందరూ పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

### స్వచ్ఛ మందిర్

**కర్నూలు కల్చరల్:** ఓల్డ్‌సిటీలోని దక్షిణ షిరిడీ సాయిబాబా దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారంఉదయం 8 గంటలకు స్వచ్ఛ భారత్– స్వచ్ఛ మందిర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మహాబలేష్ తెలిపారు. సాయి భక్తులు, సాయి సేవకులు సాయి దీక్షా పరులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

### గురుపూజోత్సవం

**కర్నూలు కల్చరల్:** రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు నందికొట్కూరు రోడ్‌లోని రంగా కల్యాణ మండపంలో గురుపూజోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ నగర సంఘ చాలక్ డాక్టర్ చల్లా వాసు రెడ్డి తెలిపారు. విభాగ్ ప్రచారక్ సురేంద్ర బాబు ముఖ్య వక్తగా హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. రిడ్జ్ స్కూల్ సీఈఓ గూడూరు గోపీనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

# బదిలీలు పారదర్శకంగా చేపడతాం

**కర్నూలు(అగ్రికల్చర్):** గ్రామ ఉద్యాన సహాయకుల (వీహెచ్ఏ) బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని ఏపీఎంఐపీ పీడీ కే.శ్రీనివాసులు అన్నారు. శనివారం కర్నూలు ఉద్యాన భవన్ లో ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న వీహెచ్ఏల బదిలీలకు సంబంధించి ఆప్షన్ తీసుకున్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ... ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం బదిలీలు చేపడుతామని ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ నెల 30వ తేదీన బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల ఉద్యాన అధికారులు పి.రామాంజనేయులు, నాగరాజు, ఉద్యాన అధికారులు అనూష, శ్రీవాణి, మదన్‌మోహన్‌గౌడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

–ఉమ్మడి జిల్లా పశుసంవర్ధకశాఖలో గ్రామస్థాయిలో పనిచేస్తున్న ఏహెచ్‌ఏల బదిలీల ప్రక్రియను ఉమ్మడి జిల్లా అధికారులు చేపట్టారు. జిల్లాలో 377 మంది ఏహెచ్‌ఏలు పనిచేస్తుండగా.. 104 మంది నుంచి ఆప్షన్‌లు తీసుకున్నారు. ఐదేళ్లు పూర్తి అయిన వారు 16 మంది, రిక్వెస్ట్‌పై 64 మంది. సచివాలయాలను కుదించడం వల్ల 27 మందిని ఇతర సచివాలయాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంది. వీరి నుంచి ఆప్షన్‌లు తీసుకున్నారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల పశుసంవర్ధక శాఖ అధికారులు జి.శ్రీనివాస్, గోవింద్‌నాయక్, గజిటెడ్ మేనేజర్ జవహర్‌లాల్ పాల్గొన్నారు.

# మాతాశిశు సంరక్షణలో ఎంసీపీ కార్డు కీలకం



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ రఘు

**కర్నూలు(హాస్పిటల్):** మాతాశిశు సంరక్షణలో ఎంసీపీ కార్డు కీలకంగా పనిచేస్తుందని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు చెప్పారు. శనివారం కర్నూలు మండలం భూపాల్‌నగర్‌లోని మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం గర్భిణులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణ కార్డు మాతాశిశు మరణాలను పకడ్బందీగా నియంత్రిస్తుందన్నారు. మొదటి నెల గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు అయ్యేంత వరకు ఆమె ఆరోగ్య పరిస్థితులు, అందించిన వైద్యం, వ్యాధినిరోధక టీకాల వివరాలు, ప్రసవం అయ్యాక శిశువు ఆరోగ్యంగా ఎదదిగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వివరాలు ఆరోగ్య కార్యక్రమాలన్నీ ఈ కార్డులో నమోదు చేస్తారన్నారు. దీన్ని పరిశీలించి వైద్యులు ప్రతి నెలా వారికి చికిత్సలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ హేమలత, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నజీర్, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు హనుమంతమ్మ, వేణుగోపాల్‌రెడ్డి, సామాజిక ఆరోగ్య అధికారి యశోద, ఆరోగ్య కార్యకర్తలు అనిత, వెంకటేష్, వరలక్ష్మి, వరాలు, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

# కొత్త ఈద్గా సమీపంలో చోరీ

- 18 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ

**కర్నూలు :** నగర శివారులోని కొత్త ఈద్గా సమీపంలో ఉన్న ఆసియాన్ అపార్ట్‌మెంట్‌లో అర్బాస్ ఖాన్ ఇంట్లో దొంగలు పడి అందినకాడికి దండుకుని పరారయ్యారు. ఈయన కర్నూలు ఎంపీడీఓ కార్యాలయంలో క్లర్కుగా పనిచేస్తారు. ఈనెల 24వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదులో పెళ్లికి వెళ్లారు. ఇదే ఇంట్లోనే అన్న, వదిన కూడా ఉంటారు. 26వ తేదీన వదిన డెలివరీ కోసం పుట్టింటికి వెళ్లగా ఆమె భర్త ఉద్యోగ రీత్యా ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి గదిలోని వెళ్లి బీరువాలో ఉన్న 18 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు మూటగట్టుకుని ఉడాయించారు. అర్బాస్ ఖాన్ శనివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచిఉన్నాయి. గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడివుండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చాడు. నాలుగో పట్టణ సీఐ విక్రమ సింహ క్రైం పార్టీ సిబ్బందితో అక్కడికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ సిబ్బందిని రప్పించి ఆధారాలను సేకరించారు. అక్కడున్న సీసీ కెమెరాలను పరిశీలించగా ముందు రోజు నుంచి పనిచేయడం లేదని తేలింది. వాచ్‌మెన్ కూడా అపార్ట్‌మెంట్ నిర్వాహకుల అనుమతితో ముందు రోజు పనిమీద వేరే ఊరికి వెళ్లాడు. దీంతో వాచ్‌మెన్ పాత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అర్బాస్ ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



దొంగలు బీరువాను బద్దలుకొట్టిన దృశ్యం